## నిబంధనల ప్రకారమే తమిళనాడుకు
# బియ్యం ఎగుమతి

- రైస్‌మిల్లర్లపై తప్పుడు ప్రచారం సరికాదు
- కరీంనగర్ రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నర్సింగరావు
- దుష్ప్రచారం మానుకోవాలి : ప్రధాన కార్యదర్శి కరుణాకర్



మాట్లాడుతున్న రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 5 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి తమిళనాడుకు అక్రమంగా బియ్యం ఎగుమతి చేస్తున్నట్లు కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా నిరాధారమని కరీంనగర్ రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదని చెప్పారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలకు ఒడిగట్టి.. మిల్లర్లను అబాసుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మిల్లర్ల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో పలువురు మిల్లర్ల యజమానులతో కలసి ఆయన మాట్లాడారు. మిల్లర్లు సొంతంగా కొనుగోలు చేసిన ధాన్యం ద్వారా తీసిన బియ్యాన్ని మాత్రమే తమిళనాడుకు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. అయితే కొంతమంది ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన కస్టం మిల్లెడ్ రైస్ (సీఎంఆర్) ధాన్యాన్ని పట్టి.. తమిళనాడుకు ఎగుమతి చేస్తూ.. అక్రమాలకు పాల్పడుతున్నామంటూ పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వీరి మాటలు నమ్మి పలు పత్రికలు ఇదే వార్తలు రాస్తున్నాయని, తద్వారా మిల్లర్ల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన చెందారు. కస్టం మిల్లెడ్ రైస్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నట్లు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని, కావాలని తమపై అభాండాలు వేయడం మంచి పద్ధతికాదన్నారు. కేంద, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను తాము ఉల్లంఘించడం లేదని, చట్టానికి లోబడి మాత్రమే మిల్లుల నుంచి బియ్యం ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా తమిళనాడుకు ఇటీవల చేస్తున్న ఎగుమతులన్నీ తాము కొనుగోలు చేసిన ధాన్యం నుంచి తీసిన బియ్యం మాత్రమేనని, అది కూడా 20శాతం తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. మిల్లులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులు, రవాణా రంగం ఆధారపడి ఉందని, అన్‌సీజన్‌లో వారికి జీవనోపాధి కల్పించే క్రమంలో తాము కొనుగోలు చేసిన ధాన్యం మరాడిస్తూ, విక్రయించామన్నారు. నిజానికి పదేళ్లుగా ఎక్స్‌పోర్టులు లేవని, ఇటీవలే పలు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తమిళనాడుకు ఎగుమతి చేస్తున్నామని, ఎక్కడా నిబంధలు ఉల్లంఘించడం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌లో 50శాతం, రబీ సీజన్‌లో 11శాతం మాత్రమే కస్టం మిల్లెడ్ రైస్ ప్రభుత్వానికి అప్పగించగా, మిగతా ధాన్యం మిల్లుల్లో గుట్టలకు గుట్టలుగా పేరుకుపోయినట్లు తెలిపారు. దీనికితోడు తాము కొనుగోలు చేసిన ధాన్యం కూడా నిల్వ ఉంచడంతో, వర్షాకాలంలో వచ్చే ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లభించడం గగనమవుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 4.5 లక్షల నుంచి 5 లక్షల హెక్టార్ల వరకు వరి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారని, గతేడాది కన్నా ఈ సారి అధిక దిగుబడి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని, ఈ సమస్యను అధిగమించడంతోపాటు కూలీలకు ఉపాధి కల్పించేందుకే మిల్లర్లు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే తాము స్వయంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఖాళీ చేసేందుకు గాను, వాటి ద్వారా వచ్చిన బియ్యాన్ని తమిళనాడుకు పంపిస్తున్నామన్నారు. దీనిపై అవగాహన లేకుండా.. సరైన సమాచారం తీసుకోకుండానే కొంత మంది చిలువలు, పలువలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా నుంచి కేవలం నాలుగు ర్యాకుల్లో 15వేల టన్నులు మాత్రమే ఇప్పటివరకు తమిళనాడుకు పంపితే, లక్షల టన్నులు పంపినట్లుగా ప్రచారం చేయడం అవివివేకమన్నారు. మిల్లర్లు ఎప్పుడు కూడా వ్యవహరించలేదని, భవిష్యత్‌లో కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయబోరన్నారు. ప్రధాన కార్యదర్శి కరుణాకర్ మాట్లాడుతూ, రైస్ ఇండస్ట్రీపై ఆధారపడి వేలాది మంది జీవనోపాధి పొందుతున్నారని, అసత్య ప్రచారంతో వారందరికీ ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందన్నారు. ఒక్కో మిల్లులో ₹5కోట్ల నుంచి ₹50 కోట్ల విలువైన మిషన్స్ ఉన్నాయని, తాము ఎక్కడికి వెళ్లేవాళ్లం కాదని, ఇటు ప్రభుత్వానికి అటు రైతులకు అనుసంధానంగా నిబంధనలకు లోబడి మిల్లులు నడుతుపుతున్నామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిల్లు లోపలికి వచ్చే ధాన్యం బస్తాలతోపాటు బయటకు వెళ్లే ప్రతి బియ్యం బస్తాకు అధికారిక లెక్కలుంటాయని, అందులో ఎక్కడా నిబంధనలు విస్మరించడానికి అవకాశం ఉండదన్న విషయాన్ని గుర్తించాలని, రైస్‌మిల్లర్లపై దుష్ప్రచారం మానుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బోయినపల్లి ప్రభాకర్‌రావు, వేణు,ప్రతినిధులు పాల్గొన్నారు.

# 16న లాభాల వాటా

- దసరాకు వారం ముందే రూ.711.18 కోట్ల బోనస్
- ఒక్కో కార్మికుడికి సగటున రూ. 1.53 లక్షలు
- సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 32 శాతం చెల్లింపులు
- సీఎండీ శ్రీధర్

గోదావరిఖని, అక్టోబర్ 5 : సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ప్రకటించిన లాభాల వాటాను ఈ నెల 16న చెల్లించనున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.2222.46 కోట్ల లాభాలను అర్జించగా, ఇందులో రూ.711.18 కోట్ల(32 శాతం)ను దసరా పండుగకు వారం ముందే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఒక్కో కార్మికుడికి సగటున రూ. 1.53 లక్షల వరకు అందనున్నట్లు ఆయన తెలిపారు. సింగరేణిని లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ శాతాన్ని లాభాల వాటా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు సింగరేణి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బోనస్ చెల్లింపుపై డైరెక్టర్ బలరాం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో మరే ఇతర బొగ్గు కంపెనీలో లేనివిధంగా సింగరేణి సంస్థ ప్రతి ఏడాది తనకు వచ్చిన నికర లాభాల్లో కొంత శాతం వాటాను బోనస్‌గా కార్మికులకు పంచుతున్నది. రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ గతంలో కన్నా ఎక్కువ శాతం ప్రకటిస్తున్నారు. తెలంగాణ రాకముందు 2013-14లో 20 వాతం ఇవ్వగా, రాష్ట్రం వచ్చిన తర్వాత 2014-15లో 21 శాతం, 2015-16లో 23 శాతం, 2016-17లో 25 శాతం, 2017-18లో 27 శాతం, 2018-19లో 28 శాతం, 2020-21లో 29 శాతం, 2021-22లో 30 శాతం ప్రకటించారు. దసరా పండుగకు ముందే కార్మికుల చేతికి అందేలా చూడాలని సీఎం యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు యాజమాన్యం పూర్తి ఏర్పాట్లు చేసింది. సింగరేణిలో విధులు నిర్వహించిన 46,326 మంది ఉద్యోగులకు 32 శాతం వాటా కేటాయించిన రూ.711.18 కోట్లు వారు పని చేస్తున్న గని, శాఖల ఆధారంగా లాభాల బోనస్‌ను లెక్కించి చెల్లించనున్నారు. ఎక్కువ హాజరు ఉంటే ఎక్కువ మొత్తంలో బోనస్ దక్కనుంది. భూగర్భ గని ఉద్యోగులకు రూ.749.58 చొప్పున వారు పని చేసిన మొత్తం దినాలకు లెక్కగట్టి బోనస్ చెల్లిస్తారు. ఓసీపీల్లో పని చేసే వారికి రూ.627.41 చొప్పున చెల్లిస్తారు. మిగిలిన శాఖల వారికి రూ.578.69 చొప్పున పని చేసిన దినాలకు లెక్కకట్టి చెల్లిస్తారు. మొత్తంగా సగటున ఒక్కో కార్మికునికి రూ.1,53,516 వరకు లాభాల బోనస్ పొందే అవకాశం ఉంది.

## బొడ్డెమ్మ..బొడ్డెమ్మ కోల్..

- అట్టహాసంగా ప్రారంభం
- తొమ్మిదిరోజుల పాటు వేడుకలు

కోల్‌సిటీ/ఓదెల/జూలపల్లి / వేములవాడ టౌన్, అక్టోబర్ 5: బొడ్డెమ్మ పండుగ ప్రకృతి పండుగ. మనిషికి మట్టికి, ప్రకృతికి ఉన్న అనుబంధాన్ని తెలియజేసే పండుగ. బొడ్డెమ్మను పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మ, అంతరాల బొడ్డెమ్మ అని ఆయా ప్రాంతాలను బట్టి పిలుస్తారు. అనాదిగా ఈ వేడుకను జరుపుకుంటూ వస్తున్నారు. కానీ, బతుకమ్మను పేర్చినట్టుగా ఇంటింటా బొడ్డెమ్మను పేర్చరు.. కేవలం ఆనవాయితీ ఉన్నవారు మాత్రమే బతుకమ్మ పండుగకు ముందుగా జరుపుకుంటారు. పెళ్లి కాని యువతులు, చిన్న పిల్లలు అంతా కలిసి ఆటపాటలతో సందడి చేస్తుంటారు. గురువారం నుంచి గోదావరిఖనిలో బొడ్డెమ్మ వేడుక ప్రారంభమైంది. బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్.. బిడ్డాలెందరూ కోల్' అంటూ ఆటలు మొదలుపెట్టారు. చివరలో నిద్రపో బొడ్డెమ్మ నిద్ర పోవమ్మా, నిద్రాకు నూరేండ్లు నీకు వెయ్యేండ్లు, నిను గన్న తల్లీకి నిండా నూరేండ్లు అంటూ పాడి తర్వాత బొడ్డెమ్మను తీసి జాగ్రత్తగా దేవుని దగ్గరకు తీసుకవెళ్తారు. ఇలా 9 రోజుల పాటు ఆడిన అనంతరం బొడ్డెమ్మను నీటిలో నిమజ్జనం చేస్తూ పోయిరా బొడ్డెమ్మ పోయి రావమ్మా అంటూ పాడుతారు. మరుసటి రోజే బతుకమ్మ పండుగ మొదలవుతుంది.

# నేడే హరీశ్‌రావు రాక

- కోరుట్ల, ఇల్లంతకుంటలో అమాత్యుడి పర్యటన
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- రెండూ చోట్లా బహిరంగసభలకు హాజరు



కోరుట్ల: హెలీప్యాడు సిద్ధం చేస్తున్న కార్మికులు



ఇల్లంతకుంటలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చిత్రంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

కోరుట్ల/ఇల్లంతకుంట, అక్టోబర్ 5: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల, సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. ముందుగా కోరుట్ల పట్టణానికి రానున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు హెలికాప్టర్‌లో అయిలాపూర్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కోరుట్లలోని ఐబీ రోడ్డుకు చేరుకుంటారు. అక్కడ వంద పడకల దవాఖానకు ప్రారంభోత్సవం చేస్తారు. తర్వాత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత 3గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రానికి బయలుదేరుతారు. అక్కడ వ్యవసాయ మార్కెట్, పల్లె దవాఖాన, మహిళ సంఘ భవనాలకు ప్రారంభోత్సవంతోపాటు 50 పడకల దవాఖాన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. తిరిగి 5గంటలకు పర్యటన ముగించుకొని తిరిగి పయనమవుతారు. కాగా, కోరుట్లలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు లక్షపై చిలుకు పాల్గొనే సభలో ప్రజలకు సరిపడా కుర్చీలు, ఇతర సదుపాయాలు కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా షామియానాలు, స్టేజీని నిర్మిస్తున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ కోరుట్ల నియోజకర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల దగ్గరుండి మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### సభను జయప్రదం చేయండి
### : ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంటలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సభను విజయంతం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను ఏర్పాట్లను, హెలీప్యాడ్, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. తర్వాత గిఫ్ట్ ఏ స్మైల్ కింద ఆరుగురు దివ్యాంగులకు స్కూటీలు, ఇద్దరికి బ్యాటరీ ట్రై సైకిళ్లు, క్రికెట్ కిట్లను అందజేశారు. తర్వాత మాట్లాడారు. బహిరంగ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్ గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఉప సర్పంచ్ సాదుల్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### పెద్ద సంఖ్యలో తరలిరావాలి

కోరుట్లలో మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి. ప్రభుత్వ సహకారంతో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.12.50 కోట్ల నిధులతో తొమ్మిది నెలల కాల వ్యవధిలో వంద పడకల దవాఖాన నిర్మించాం. నేడు ప్రారంభించుకోబోతుండడం సంతోషంగా ఉంది. అలాగే పట్టణంలోని మద్దుల చెరువు మినీ ట్యాంకు బండ్‌ను అభివృద్ధి చేసుకున్నాం. ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు రూ.18 లక్షలు వెచ్చించి రెండు బోట్లు కొనుగోలు చేశాం. ట్యాంక్‌బండ్‌ను కూడా మంత్రితో ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. కాగా, మినీ స్టేడియంలో జరిగే మంత్రి హరీశ్‌రావు సభకు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున్న తరలివచ్చి విజయవంతం చేయాలి.

**- కోరుట్లలో విలేకరులో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**